nipuna
Every Wednesday Free Supplement
05.
18 అక్టోబర్ 2023
పేజీలు 8

### జంతు దినోత్సవం

ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం (వరల్డ్ యానిమల్ వెల్ఫేర్ డే)ను అక్టోబర్ 4న నిర్వహించారు. ప్రపంచ జంతు దినోత్సవం 1925లో ప్రారంభమైంది. రచయిత, ప్రచురణకర్త అయిన హెన్రిచ్ జిమ్మర్‌మన్ ఈ కార్యక్రమాన్ని మార్చి 24న నిర్వహించారు. 1931లో ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో జరిగిన అంతర్జాతీయ జంతు పరిరక్షణ కాంగ్రెస్ సందర్భంగా అక్టోబర్ 4 నుంచి అధికారికంగా నిర్వహిస్తున్నారు. జంతువుల సంరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ దినోత్సవాన్ని చేపడుతున్నారు. ఈ ఏడాది ఈ దినోత్సవ థీమ్ 'గ్రేట్ ఆర్ స్మాల్, లవ్ దెమ్ ఆల్'.

# – పాలస్తీనా వివాదం

- 2005లో గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలిగినప్పటికీ, ఐక్యరాజ్యసమితి ఆ భూమిని ఇప్పటికీ ఆక్రమిత భూభాగంగానే పరిగణిస్తోంది. ఇక్కడి ప్రజలు, వస్తువులు, సేవలు, గాలి, నీరు, సముద్రంపై ఇంకా ఇజ్రాయెల్ నియంత్రణ ఉంది. ప్రస్తుతం గాజా, పాలస్తీనియన్ తీవ్రవాద సంస్థ 'హమాస్' పాలనలో ఉంది. ఈ సంస్థ ఇజ్రాయెల్‌తో అనేకమార్లు పోరాడింది. వెస్ట్ బ్యాంక్, పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ నియంత్రణలో ఉంది.
- పాలస్తీనియన్ నేషనల్ అథారిటీని అంతర్జాతీయ సమాజం పాలస్తీనా ప్రభుత్వంగా గుర్తిస్తుంది. ఇజ్రాయెల్ ఏర్పడిన తరువాత, పాలస్తీనియన్లను అక్కడ నుంచి పంపించేసిన తరువాత గాజా, వెస్ట్ బ్యాంక్, జోర్డాన్, సిరియా, లెబనాన్‌లలో పాలస్తీనా శరణార్థులు పెరగసాగారు. అరబ్ దేశాల్లో శరణార్థుల శిబిరాలలో పాలస్తీనా ఉద్యమం ఊపందుకుంది. ఈ ఉద్యమానికి ఈజిప్ట్, జోర్డాన్‌ల మద్దతు లభించింది.

**పాలస్తీనా విముక్తి సంస్థ**

- 1967లో జరిగిన యుద్ధం తరువాత యాసర్ అరాఫత్ నేతృత్వంలోని 'ఫతా' వంటి సంస్థలు కలిసి 'పాలస్తీనా విముక్తి సంస్థ (పీఎల్‌ఓ)'ను ఏర్పాటు చేశాయి. పీఎల్‌ఓ మొదట జోర్డాన్ నుంచి, తరువాత లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ లోపల, వెలుపల ఉన్న అన్ని ప్రాంతాలనూ లక్ష్యాలుగా చేసుకుంది.
- రాయబార కార్యాలయాలు, విమానాలు, ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుంది. ఇజ్రాయెల్‌పై పీఎల్‌ఓ దాడులు అనేక సంవత్సరాలపాటు కొనసాగాయి. చివరకు, 1993లో ఓస్లో శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్, పీఎల్‌ఓ సంతకాలు చేశాయి. పాలస్తీనా విముక్తి సంస్థ ఉగ్రవాదాన్ని, హింసను విడిచిపెడతామని హామీ ఇచ్చింది. ఇజ్రాయెల్ శాంతి, భద్రతల హక్కును అంగీకరించింది. కానీ, హమాస్ ఈ ఒప్పందాన్ని అంగీకరించలేదు.
- ఓస్లో ఒప్పందం తరువాత పాలస్తీనా నేషనల్ అథారిటీ ఏర్పడింది. ఈ అథారిటీకి అంతర్జాతీయ స్థాయిలో పాలస్తీనా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే హక్కు లభించింది. దీనికి అధ్యక్షుడిని ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. అలా ఎన్నికయిన అధ్యక్షుడు ప్రధానమంత్రిని, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పౌరులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే హక్కు ఈ అథారిటీకి ఉంటుంది. అయితే, చారిత్రకంగా పాలస్తీనియన్ల రాజధానిగా పరిగణిస్తున్న తూర్పు జెరూసలేంను ఈ ఒప్పందంలో చేర్చలేదు. జెరూసలేంకు సంబంధించి ఇప్పటికీ రెండు పక్షాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతోంది.







## ఏమిటీ హమాస్?

- హమాస్ పూర్తి పేరు 'హర్కత్ అల్ ముఖావమా అల్–ఇస్లామియా' పాలస్తీనాలోని రెండు రాజకీయ పక్షాల్లో ఇదొకటి. 1987లో వెస్ట్ బ్యాంక్, గాజా, తూర్పు జెరుసలేంలో ఇజ్రాయెల్ ఆక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రాంతాల్లో మొదటి ఇంతిఫధా (తిరుగుబాటు) ఉద్యమం జరిగింది. ఆ సమయంలోనే హమాస్ ఏర్పాటైంది. షేక్ అహ్మద్ యాసిన్ దీన్ని నెలకొల్పారు.
- ఇది 'ముస్లిం బ్రదర్ హుడ్ సంస్థకు రాజకీయ అనుబంధ విభాగంగా ఉండేది. 1988లో హమాస్ తన చార్టర్‌ను ప్రచురించింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలని, ఒకప్పటి పాలస్తీనాను పునరుద్ధరించి ఇస్లామిక్ సమాజాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అందులో ప్రకటించింది.
- 1993లో పాలస్తీనా నేత యాసర్ అరాఫత్, అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఇజాక్ రాబిన్ మధ్య ఓస్లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం వెస్ట్ బ్యాంక్, గాజాల్లో పాలస్తీనా అథారిటీ ఆధ్వర్యంలో పరిమిత స్వయం పాలన ప్రభుత్వం ఏర్పడింది. దీన్ని హమాస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఒప్పందాన్ని నిరసిస్తూ హింసకు దిగింది. అదే ఏడాది ఏప్రిల్లో తొలిసారి ఆత్మాహుతి దాడికి పాల్పడింది. అది మొదలు అనేక దాడులకు దిగింది. ఇదో విదేశీ ఉగ్రవాద సంస్థ అంటూ అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ప్రకటించాయి.
- గాజాలో హమాస్ బలంగా ఉంది. 2006 నుంచి ఆ ప్రాంతంలో పరిపాలన సాగిస్తోంది. పాలస్తీనా ప్రవాసులు, పర్షియన్ గల్ఫ్‌లోని ప్రైవేటు దాతలు ఎక్కువగా హమాస్‌కు నిధులు అందిస్తుంటారు. పశ్చిమ దేశాల్లోని ఇస్లామిక్ దాతృత్వ సంస్థల నుంచి సాయం అందుతుంది. తుర్కియే నుంచి కూడా నిధులు వస్తున్నాయి. ఇరాన్ ప్రస్తుతం ఏటా 10 కోట్ల డాలర్లను హమాస్‌కు అందిస్తుంది.
- హమాస్ ఆయుధాల్లో ప్రధానమైనవి.. నేల నుంచి నేల మీద లక్ష్యాలపైకి ప్రయోగించే సామర్థ్యమున్న రాకెట్లు. లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించేలా స్వీయమార్గనిర్దేశం (గైడెడ్ సామర్థ్యం) వీటికి ఉండదు. అయినా వాటిని పెద్ద సంఖ్యలో ప్రయోగించడం ద్వారా ఇజ్రాయెల్‌ను చికాకుపెడుతుంది. వీటి సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోతోంది.
- మోర్టార్లతోనూ దాడులకు దిగుతోంది. మండే స్వభావం గల పరికరాలతో కూడిన బెలూన్లను ఇజ్రాయెల్ పైకి వదులుతుంటుంది. వీటివల్ల మంటలు చెలరేగి.. భారీగా నష్టం వాటిల్లుతోంది. హమాస్‌లో ప్రస్తుతం 30 వేల మంది మిలిటెంట్లు, 400 మంది నేవల్ కమాండోలు ఉన్నారు.

## అసలేంటి అల్ -అఖ్సా?

- ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య గొడవలకు తూర్పు జెరూసలేంలోని అల్–అఖ్సా ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు, ముస్లింలు, యూదులు అత్యంత పవిత్రంగా భావించే పాత జెరూసలేంలో ఉండే అల్–అఖ్సా ఓ మసీదు. ఇస్లాం మతస్థులకు అత్యంత పవిత్ర స్థలాల్లో అల్–అఖ్సా ఒకటి. ఇస్లామిక్ నమ్మకాల ప్రకారం మహమ్మద్ ప్రవక్త మక్కా నుంచి ఒక రాత్రి ఇక్కడికి వచ్చి ప్రార్థన చేసిన తర్వాత స్వర్గారోహణ చేశారని చెబుతారు. యూదులు ఇదే ప్రాంతాన్ని టెంపుల్‌మౌంట్‌గా అభివర్ణిస్తారు. వారికి ఈ టెంపుల్‌మౌంట్ అత్యంత పవిత్రస్థలం.
- ఒకప్పుడు ఈ కొండపై రెండు పురాతన యూదు ఆలయాలు ఉండేవి. మొదటిది బైబిల్ ప్రకారం కింగ్ సాల్మన్ నిర్మించింది. తర్వాత బాబిలోనియన్స్ దాన్ని కూలగొట్టారు. రెండోది నిర్మితమై 600 ఏళ్ల తర్వాత క్రీ.శ. తొలి శతాబ్దిలో రోమన్ చక్రవర్తి చేతిలో ధ్వంసమైంది. మెస్సయ్య తిరిగి వచ్చాక ఇక్కడే మళ్లీ ఆలయం కడతారని, ఇక్కడ ఇంకా దైవశక్తి ఉందని యూదుల నమ్మకం.
- 1967లో జరిగిన అరబ్–ఇజ్రాయెల్ యుద్ధంలో.. తూర్పు జెరూసలేంను జోర్డాన్ నుంచి ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఒకప్పుడు కూల్చిన తమ ఆలయాలను పునర్నిర్మించడానికి 1990లో కొంతమంది యూదు అతివాదులు ప్రయత్నించగా, గొడవలు తీవ్రమయ్యాయి. 1994 లో జోర్డాన్, ఇజ్రాయెల్ మధ్య ఓ శాంతి ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం అల్–అఖ్సా విషయంలో యథాతథస్థితి కొనసాగించాలని నిర్ణయించారు.

మిగతా 6వ పేజీలో..

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

